క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం

అయిజ: మున్సిపాలిటీలోని భద్రయ్య కాంప్లెక్స్ సమీపంలో మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుత్ తీగల నుంచి మంటలు చెలరేగాయి. స్థానిక ప్రజలు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం విద్యుత్ సిబ్బంది అక్కడకు చేరుకొని కాలిపోయిన విద్యుత్ తీగలను తొలగించి నూతన తీగలు ఏర్పాటు చేశారు. ప్రమాదం తప్పడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వాహనాల పట్టివేత

మల్దకల్ : మండలంలోని అయిజ– గద్వాల రహదారిపై మంగళవారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పలు వాహనాలు పట్టుకున్నట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు. లైసెన్స్ లేకపోవడంతో ట్రాక్టర్ల డ్రైవర్లు 8 మందిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్లను స్టేషనుకు తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో నల్లాల అపహరణ



అయిజ: మున్సిపాలిటీలోని 11వ వార్డు గుర్రం తోట కాలనీలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు ఏర్పాటు చేసిన స్టీల్ ట్యాప్ (నల్లా) భాగాలను అపహరించారు. దీంతో మిషన్ భగీరథ తాగునీరు వృథాగా పోవడం వలన పలు కాలనీలకు తాగునీటి కొరత ఏర్పడింది. పట్టణంలో గత కొన్ని రోజుల నుంచి గుర్తు తెలియని దుండగులు స్టీల్ ట్యాప్‌లను అపహరిస్తున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

గుండెపోటుతో మాజీ ఉపసర్పంచ్ మృతి

అయిజ: మండలంలోని కేశవరం గ్రామ మాజీ ఉప సర్పంచ్ కేశారం (35) మంగళవారం పొలంలో పనిచేస్తూ గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. పొలంలో పనిచేస్తూ ఉన్నట్లుండి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

మాజీ ఎంపీ కోలుకోవాలని పూజలు




అలంపూర్ : అలంపూర్ జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మందా శ్రీనాథ్, నాయకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం త్వరగా కోలుకోవాలని పూజలు చేసినట్లు తెలిపారు. మాజీ ఎంపీ కుమారుడు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, మహేష్ గౌడ్, ఆత్మలింగారెడ్డి, ఏకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గద్వాల క్రైం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి పట్టణంలోని తాయమ్మ గుడి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నాడు. సమాచారం మేరకు బీరోలు చౌరస్తా సమీపంలో ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గత కొన్ని రోజులుగా తాయమ్మ గుడి సమీపంలో ఇసుక డంపు చేసి దందాకు పాల్పడుతున్నట్లు గుర్తించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

బెస్ట్ స్కూల్ అవార్డుకు ఎంపిక



ధరూరు : బెస్ట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డుకు ధరూరు ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు ధరూరు ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విద్యా సంస్థల అధినేత ప్రీతిరెడ్డి, సమగ్ర శిక్ష డైరెక్టర్ ప్రొఫెసర్ రాధారెడ్డి, టీవీ అధినేత రాజగోపాల్ చేతుల మీదుగా జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాఘవేంద్ర, పీడీ శ్రీనివాసులు, ఎస్‌ఏ శ్రీధర్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

సొంత భవనాలు లేక సమస్యలు

- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



మల్దకల్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

మల్దకల్ : అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక, మౌలిక వసతులు లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖలో అంగన్‌వాడీ కేంద్రాలది కీలకపాత్ర, చిన్నారులకు గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించే ఈ కేంద్రాలు మౌలిక సదుపాలయాల లేమితో అవస్థలు పడుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అవి కూడా సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు మంచి నీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు ఉన్నా అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని అయా గ్రామాల ప్రజలు అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమలు కాని ఆదేశాలు..

అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు అవరణలో పెరటి తోటలు సాగు చేసి వాటి ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించిన ప్రాథమిక స్థాయిలో అది అమలు కావడం లేదు.

సగమే సొంత భవనాలు..

మల్దకల్ మండలంలో మొత్తం 59 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 30 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మిగతావి గ్రామ పంచాయతీ, సామాజిక కమ్యూనిటీ భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిలో మొత్తం 2793 మంది చిన్నారులు, 759 మంది గర్భిణీ, బాలింతలు ఉన్నారు. సొంత భవనాలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలకు ఏర్పాటు చేయాలని ఉన్నా భవనాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

సొంత భవనం ఏర్పాటు చేయాలి..



గ్రామంలో 6 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 2వ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. సరైన వసతులు లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. తామే వెళ్లి పౌష్టికాహారం తీసుకుంటున్నాం.

- సుస్మిత, మల్దకల్

అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం..



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె భవనంలో సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలకు మరుగుదొడ్లు వంటి సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

-పుష్పలత అంగన్‌వాడీ టీచర్, మల్దకల్

సమస్యలు పరిష్కరిస్తాం..



అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలన్నింటిని పరిశీలించి నివేదిక ప్రభుత్వానికి అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే సొంత భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, సిబ్బంది ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.

-హేమలత, సీడీపీఓ

అగమ్యగోచరంగా కార్మికుల జీవితాలు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రాజోళి : పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న అన్నారు. సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మంగళవారం ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. కొన్ని నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో ఇళ్లు గడవడం కూడా కష్టంగా మారుతుందన్నారు. కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉంచడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కమిటీ సభ్యులు లక్ష్మన్న, తిక్కన్న, సత్తార్ మియా, కృష్ణ, పుల్లన్న, శశి రెడ్డి తదిదరులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధిస్తే నేర్చుకుంటారు



నమూనాలు పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ అక్తర్

కేటీదొడ్డి: విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థమయ్యేలా బోధిస్తే విద్యార్థులు ఏదైనా నేర్చుకుంటారని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గువ్వలదిన్నెలో ఎంపీఎఫ్ మండల విద్యాశాఖ ఆధ్వర్యంలోని మంగళవారం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం నజియా బేగం అధ్యక్షతన సబ్జెక్ట్ మేళా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ అక్తర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్జెక్ట్ మేళాలో మూడో తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సామాజిక అంశాలు, సౌర కుటుంబ వ్యవస్థ, నివాసాలు, పండుగల ప్రత్యేకతల నమూనాలు, సహజ వనరుల వంటి అంశాలను ప్రదర్శిస్తూ ఉపాధ్యాయులతో కలిసి వివరించారు. కార్యక్రమంలో సబ్జెక్ట్ రిసోర్స్ పరుశరాముడు, రాము, చంద్రశేఖర్, బాలకృష్ణ, అమ్మ అదర్శ పాఠశాల చైర్మన్ హైమవతి, వెంకటేష్ గౌడ్, శ్రీపాదరెడ్డి, యుగంధర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సింధు

మానవపాడు : సీజనల్ వ్యాధులపై గర్భిణులకు అవగాహన కల్పించాలని డాక్టర్ సింధు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులకు రిజిస్ట్రేషన్ నమోదు చేయాలన్నారు. సాధారణ కాన్పులు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రలలో జరిగేలా చూడాలన్నారు. ఎచ్‌ఎమ్‌పీవీ వైరస్, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెలెన్, చంద్రన్న, అనూష, సంధ్య, ఏఎన్‌ఎమ్‌లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

కేటీదొడ్డి: జోగుళాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలోని మంగళవారం సరస్వతి హైస్కూల్‌లో ఎస్టీయూ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కేటీదొడ్డి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా సురేందర్, (శివరంగాపురం) అధ్యక్షుడిగా రాముడు, (వెంకటాపూర్) ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఎర్సన్‌దొడ్డి, మహిళా కార్యదర్శి జ్యోతి (గువ్వలదిన్నె) ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, జీవన్ కుమార్, వెంకటయ్య, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ అభివృద్ధికి సహకరించాలి



డిప్యూటీ సీఎంతో ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ : అలంపూర్ నియోజకవర్గానికి అధిక నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే విజయుడు మంత్రులను కోరారు. హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఎమ్మెల్యే మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అలంపూర్ అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైనట్లు పేర్కొన్నారు. ఎర్రవల్లి నూతన మండలానికి 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. పంట సాగులో లోఓల్టేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, గ్రామీణ రహదారులు, కొత్త మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించడానికి నిధులు కేటాయించాలని వినతిలో కోరారు. సానుకులంగా స్పందించి డిప్యూటీ సీఎం అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. అదే విధంగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఆశోక్ రెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇరువురిపై కేసు నమోదు

ఎర్రవల్లి: అకారణంగా భార్యాభర్తలపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కోదండాపురం ఎస్సై స్వాతి మంగళవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని వల్లూరుకు చెందిన గోపాల్ సోమవారం తన ఇంటికి వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కృష్ణ, శ్రీను వారి ఇంటి మీదుగా వెళ్లేందుకు దారి లేదని దుర్భాషలాడుతూ కర్రలతో దాడి చేశారు. గొడవ విషయం తెలుసుకున్న గోపాల్ భార్య సావిత్రమ్మ అక్కడికి చేరుకోగా ఆమెపై కూడా ఇరువురు దాడి చేసి ఆమె బట్టలను చింపినట్లు తెలిపారు. గోపాల్, సావిత్రమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కృష్ణ, శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



ధరూరు : పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉప్పేరు, అల్వలపాడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గౌరీశంకర్, నీలావతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉప్పేరు, అల్వలపాడు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ప్రతినిధులు రత్నసింహారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కన్నవారి కళలను సాకారం చేసేందుకు కష్టపడి చదవాలన్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

95 శాతం పనులు పూర్తి

మానవపాడు : మండలంలో ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 95 శాతం పనులు పూర్తైనట్లు ఎంపీడీవో భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యదర్శులు గ్రామాల్లో ఇప్పటి వరకు 95శాతం వరకు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన 5శాతం పనులు సైతం త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయచూర్ రహదారికి మరమ్మతు

ధరూరు : గద్వాల– రాయచూర్ రహదారిపై దశాబ్దాల తరబడిగా ఏర్పడిన గుంతలను పూడ్చే ప్రక్రియకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం మండల కేంద్రంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను బీటీతో పూడ్చారు. ప్యాచ్ వర్కులు చేపట్టడంపై వాహనదారులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కర్నాటక సరిహద్దు నందిన్నె గ్రామం వద్ద నుంచి గద్వాల వరకు ప్యాచ్ వర్క్ పనులు చేపడుతున్నట్లు ఆర్ అండ్‌బీ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, గ్యాంగ్‌మెన్ మహ్మద్ తెలిపారు.

రోబోటిక్స్‌పై పరిజ్ఞానం అవసరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్ : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు రోబోటిక్స్‌పై పరిజ్ఞానం అత్యంత అవసరమని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో వేర్వేరుగా సోహం అకాడమీ ఆధ్వర్యంలో 'రోబోటిక్స్ టెక్నాలజీ'పై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంఏఎల్‌డీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు రోబోటిక్స్ పరిజ్ఞానం దోహద పడుతుందన్నారు. సోహం అకాడమీ కోఆర్డినేటర్ జశ్వంత్, రమ్య, జాహ్నవీ మాట్లాడుతూ.. రోబోటిక్స్ శిక్షణ ద్వారా విద్యార్థులు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థులు 12 మంది బృందంగా ఏర్పడి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రోబోటిక్స్ పరిజ్ఞానంపై అవగాహన కల్పించనున్నారు. వర్క్‌షాప్‌లో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ షేక్ కళాందర్ బాషా, మీనాక్షి, వైస్ ప్రిన్సిపాల్స్ చంద్రమోహన్, లక్ష్మీప్రసాద్, అధ్యాపకులు రాధిక, సత్యమ్మ, సుబ్రమణ్యం, దేవుజా, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జమ్ములమ్మ ఆలయ చైర్మన్..

గద్వాల: జమ్ములమ్మ ఆలయ కమిటీ నూతన చైర్మన్ బోయ వెంకట్రాములు మంగళవారం వాల్మీకి బోయ సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బోయలకు ఆలయ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

అనారోగ్యంతో బాధపడుతున్న ధరూరు మండలం చింతరేవుల గ్రామానికి చెందిన శ్రీను, గుడ్డెందొడ్డి గ్రామానికి చెందిన కృష్ణలకు మెరుగైన వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.13,500, రూ.28వేల చెక్కులను, గద్వాల మండల మదనపల్లికి చెందిన మొగిలన్నకు రూ.60వేల చెక్కు, మల్దకల్ గ్రామానికి చెందిన హేమలతకు రూ.34వేల చెక్కును ఎమ్మెల్యే క్యాంప్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, జి.వేణుగోపాల్, ప్రభాకర్‌గౌడ్, దౌలత్ తదితరులు పాల్గొన్నారు.

నమూనా నిర్మాణం కోసం స్థల పరిశీలన



లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

రాజోళి : ఇందిరమ్మ ఇళ్ల మోడల్ నిర్మాణం కోసం హౌసింగ్ అధికారులు మంగళవారం మండల కేంద్రంలో స్థల పరిశీలన చేపట్టారు. హౌసింగ్ డీఈ నరేందర్, ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్‌లు రాజోళిలో పర్యటించారు. ప్రస్తుతం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తుండగా.. గ్రామ కంఠంలో ఉన్న స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్మించే ఇందిరమ్మ గృహం ఎలా నిర్మించాలన్న అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలు సోదరభావంతో మెలగాలి



అలంపూర్‌లో మాట్లాడుతున్న సీఐ రవిబాబు

మల్దకల్ : గ్రామాల్లో ప్రజలందరూ సోదర భావంతో మెలగాలని గద్వాల సీఐ టంగుటూరి శ్రీను సూచించారు. మంగళవారం మండలంలోని అమరవాయి, బిజ్వారం గ్రామాల్లో ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. వాహన దారులు నియమాలు పాటించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. పేకాట, కోడిపందేలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నందికర్, నాయకులు గోపాల్‌రెడ్డి, సత్యారెడ్డి, రాజారెడ్డి, తిమ్మారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

అలంపూర్ : వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ రవిబాబు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఫంక్షన్ హాల్‌లో ఉండవెల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి, పోలీస్‌లు, వాహన దారులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల సమ్మె విరమణ




జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

గద్వాల: సమస్యల పరిష్కారం కోరుతూ సివిల్ సప్లై హమాలీ కార్మికులు గత ఏడు రోజులుగా చేపడుతున్న నిరవధిక సమ్మె రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి హామీ మేరకు తాత్కలికంగా విరమిస్తున్నట్లు సీటీఐయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సివిల్ సప్లై హమాలీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్మిక సంఘాల ప్రతినిధులతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి జరిపిన చర్చల సందర్భంగా రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రితో మాట్లాడి జీవో విడుదల చేయిస్తానని హమీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రి చేసిన విన్నపం మేరకు సమ్మె విరమిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ, శివకృష్ణ, నరేష్, చిన్ననందకిశోర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఎస్‌ఏ' ఉద్యోగుల సమ్మె విరమణ

గద్వాలటౌన్ : ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతో పాటు వివిధ డిమాండ్ల సాధన కోసం గత 28 రోజులుగా చేపట్టిన నిరవధిక సమ్మెను సమగ్ర శిక్ష అభియన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు విరమించారు. డిమాండ్లపై ప్రభుత్వ పెద్దల నుంచి సానుకూల స్పందన లభించడంతో సమ్మెను విరమిస్తున్నట్లు జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, ప్రణీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ ఫైనాన్షియల్ అంశాలను తక్షణం అమలు చేస్తామని, పేస్కేల్ అంశంపై మంత్రివర్గ ఉప సంఘం మూడు నెలల్లో నివేదిక అందిస్తుందని చెప్పారు. సమ్మెను తాత్కలికంగానే విరమిస్తున్నామని, డిమాండ్లు నెరవేర్చకుంటే మూడు నెలల తరువాత భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమ్మెకు సంఘీభావం తెలిపి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రమశిక్షణతోనే ఉన్నత విద్య



ఉపన్యాస పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

అలంపూర్ : విద్యార్థులు క్రమ శిక్షణతో ఉంటేనే ఉన్నత విద్యలో రాణిస్తారని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీ వివేకనంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ నెల 12వ తేదిన స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల పాల్గొన్నారు. పోటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎల్ల శివనాగరాజు మొదటి స్థానం, రెండో స్థానంలో హరిజనవాడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి మోక్షేశ్వర్, మూడో స్థానంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని జబీనా, నాల్గవ స్థానంలో కస్తూర్బా పాఠశాలకు చెందిన అనూష నిలిచినట్లు తెలిపారు. శ్రీస్వామి వివేకానంద యూత్ సోసైటీ సభ్యులు దాతల సహకారంతో మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ. 3 వేలు, నాల్గవ బహుమతి రూ.2 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఈదన్న, కళాశాల అధ్యాపకులు రాజు, రిటైర్డ్ తెలుగు పండిత్ వెంకట్రామయ్య శెట్టి, శ్రీ వివేకానంద యూత్ సభ్యులు కామాక్షి, ముస్తఫా, రంగస్వామి, సంజీవ నాయుడు, ప్రశాంత్ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలి

గట్టు : మండల పరిధిలోని అంతంపల్లి గ్రామంలో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ నేత అంజనేయులు ప్రారంభించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని, గెలుపు కోసం చివరి దాకా ప్రయత్నించాలని సూచించారు. ఈ సందర్భంగా పరుశరాం జట్టుకు క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.